బలగం TV BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 30 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## ఇంట్లో టపాసులు పేలి దంపతులు మృతి

బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్ యాకుత్‌పురాలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన బాణసంచాకు మంటలు అంటుకోవడంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో భార్య, భర్తలు సజీవ దహనం అయ్యారు. వారి కుమార్తెకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోహన్ లాల్, ఉషారాణి దంపతులు. వీరు బాణసంచా దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి దుకాణం మ్నూతీ వేసిన తర్వాత బాణసంచాను ఇంటికి తీసుకెళ్లారు. రాత్రి సమయంలో ఇంట్లో ఆ దంపతులు పిండివంటలు తయారు చేయసాగారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న బాణసంచాకు నిప్పు అంటుకోవడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలుకాగా వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. వారి మనవరాలుకు తీవ్ర గాయాలు కాగా మలక్‌పేట యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాణసంచా నిల్వలు ఇంట్లో ఉంచుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

# మూసీ ప్రాజెక్టుపై తగ్గేదేలే...

## నవంబర్ 1న పనులకు శంకుస్థాపన



- దీనిపై త్వరలో అఖిలపక్షాన్ని పిలుస్తాం
- మహారాష్ట్ర ఎన్నికల తర్వాతే క్యాబినెట్ విస్తరణ
- కేసీఆర్ ఎక్స్‌పైరీ మెడిసిన్.. ఆయన రాజకీయం ఏడాదిలో ముగుస్తుంది"
- కేసీఆర్‌ను మరిచిపోయేలా కేటీఆర్‌ను టార్గెట్ చేశా
- త్వరలో కేటీఆర్ ఉనికి లేకుండా హరీష్‌ను వాడతాను.
- మాకు దీపావళి పండుగ అంటే చిచ్చు బుడ్లు.. వాళ్లకు మాత్రం సారా బుడ్లు
- సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ఒక్క అడుగు ముందుకే, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నవంబర్ 1న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనుల శంకుస్థాపన జరుగునున్నట్టు సీఎం స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని సచివాలయంలో ఆయన సోమవారం మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడుతూకేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే కేసీఆర్ కనుమరుగు అవ్వనున్నారని.. ఆయన్ను సర్వనాశనం చేస్తానని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్ పాకాలను, కేటీఆర్‌ను ఎలా హ్యాండిల్ చేయాలో తనకి తెలుసన్నారు.

'దీపావళి అంటే ఇప్పటి వరకు చిచ్చుబుడ్లు చూశాం కానీ.. ఇప్పుడు మాత్రం సారాబుడ్డీలు చూస్తున్నాం. దీపావళి పార్టీ అంటే ఇంట్లో విదేశీ మద్యం, క్యాసినో కాయిన్స్ ఉండాలా? బావ బావమరిది బంధం త్వరలోనే ముగుస్తుంది. కేసీఆర్ ఎక్స్‌పైరీ మెడిసిన్.. ఆయన రాజకీయం ఏడాదిలో ముగుస్తుంది" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ప్రజలు కేసీఆర్‌ను మరిచిపోయేలా కేటీఆర్‌ను టార్గెట్ చేశామన్న రేవంత్.. కేసీఆర్ ఉనికి లేకుండా కేటీఆర్‌ను వాడా. త్వరలో కేటీఆర్ ఉనికి లేకుండా హరీష్‌ను వాడతాను. బావను ఎలా హ్యాండిల్ చేయాలో మాకు తెలుసు" అంటూ వ్యాఖ్యానించారు.

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ఒక్క అడుగు ముందుకే, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు వెయ్యి సార్లు ఆలోచిస్తామని, కానీ ఒకసారి నిర్ణయిస్తే వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. నవంబర్ 1న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనుల శంకుస్థాపన జరుగునున్నట్లు సీఎం స్పష్టం చేశారు. మొదటిగా బాపూఘాట్ నుంచి పనులు ప్రారంభిస్తామని, నవంబర్ మొదటివారంలో ఈ ప్రాజెక్టు పనుల కోసం టెండర్లు పిలుస్తావన్నారు. మూసీ పనులపై ప్రతిపక్షాలతో చర్చలకు సిద్ధమని, త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'బాపూఘాట్ నుంచి వెనక్కి 21 కి.మీ మేర త్వరలనోనే అభివృద్ధి చేస్తాం. మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీరు తరలిస్తాం. మల్లన్న సాగర్ నుంచి గోదావరి నీటి తరలింపునకు నవంబరులో చివరిలోపు తెండర్లు పిలుస్తాం. నగర ప్రజాప్రతినిధులకి మూసీ అభివృద్ధి అధ్యయనం కోసం సియోల్‌కు పంపుతాం. నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను కూడా పంపుతాం. మూసీ పునరుజ్జీవంపై చర్చ మొదలు పెట్టినందున ప్రజలకు ఈ ప్రాజెక్టుపై అవగాహన వచ్చింది. కేసీఆర్ కూడా తన అభిప్రాయాన్ని చెప్పవచ్చు. తనకు చెప్పడం ఇష్టం లేకపోతే.. మంత్రులకు చెప్పవచ్చు' అని వెల్లడించారు.

మహారాష్ట్ర ఎన్నికల తర్వాతే రాష్ట్రంలో కేబినెట్ విస్తరణ ఉంటుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నాకు ఏఐసీసీతో గ్యాప్ లేదు. కాంగ్రెస్ శ్రేణులను కన్‌ఫ్యూజ్ చేయడానికే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. తెలంగాణలో ఏఐసీసీ అంటే తానే అని కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వం చేసే మంచి పనులకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు.

"బాపు ఘాట్ వద్ద ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం. బాపుఘాట్ వద్ద బ్రిడ్జి కం బ్యారేజి నిర్మాణం చేపడతాం. అక్కడ అభివృద్ధి కోసం ఆర్మీ ల్యాండ్ కూడా ఆడిగాము.15 రోజుల్లో ఎస్టీపీలకు టెండర్లు పిలుస్తాం. మూసీని ఎకో ఫ్రెండ్లీ అండ్ వెజిటేరియన్ కాన్సెప్ట్‌తో అభివృద్ధి చేస్తాం. మూసి వెంటా అంతర్జాతీయ యూనివర్సిటీ, గాంధీ ఐడియాలజీ సెంటర్, రీక్రియేషన్ సెంటర్, నేచర్ క్యూర్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తాం" అని సీఎం రేవంత్ వెల్లడించారు.

## 100 విమానాలకు బాంబు బెదిరింపులు



బలగం టీవి, న్యూఢిల్లీ

విమానాలకు బాంబు బెదిరింపులు ఆగడం లేదు. మంగళవారం 100కు పైగా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. విమానాలు, హెూటళ్లకు బెదిరింపు ఈ-మెయిళ్లు పంపిన 35 ఏండ్ల వ్యక్తిని నాగ్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. టెర్రరిజంపై పుస్తకం రాయడమే కాక, 2021లో ఒక కేసులో అరెస్టయిన జగదీశ్ ఈ నకిలీ బాంబు బెదిరింపులకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.

## 13 జిల్లాలకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోల నియామకం

బలగం టీవి, హైదరాబాద్

జిల్లా వైద్యాధికారుల పోస్టుల ఖాళీగా ఉన్న చోట్ల ఆ బాధ్యతలను సీనియర్ వైద్యులకు రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పింది. ఈ మేరకు 13 జిల్లాలకు ఇన్చార్జి జిల్లా వైద్యాధికారులను నియమిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారి బాధ్యతలను డీఎసీఎస్ డాక్టర్ నరేందర్‌కు, జనగామకు ఏడీపీహెచ్‌వో డా.మల్లికార్జున్ కు, జోగులాంబ గద్వాల జిల్లా వైద్యాధికారి బాధ్యతలను డీఎస్ డాక్టర్ ఎస్కే. సిద్ధప్పకు, ఖమ్మం బాధ్యతలను డా. కళావతి బాయిని, ఆసీఫాబాద్ జిల్లా బాధ్యతలను డీసీఎస్ కే. సీతారాంకు, మహబూబాబాద్ బాధ్యతలను డీసీఎస్ డాక్టర్ జీ.మురళీధర్‌కు, మహబూబ్‌నగర్‌కు డా. కే. కృష్ణకు, ములుగుకు డీసీఎస్ డాక్టర్ గోపాల్‌రావు ను, పెద్దపల్లికి ఏడీపీహెచ్‌వో డా. అన్నప్రసన్నకుమారిని , సిద్ధిపేటకు మెదక్ అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ బీ. పల్వన్ కుమార్‌ను, వికారాబాద్ డాక్టర్. వై. వెంకటరావణ, వనపర్తికి డీఎసీఎస్ డా. ఏ. శ్రీనివాసులును, యాదాద్రి భువనగిరికి ఏడీపీహెచ్‌వోల డా. ఎం. మనోహర్‌కు డీఎంహెచ్‌వో బాధ్యతలను అప్పగించారు

## 12 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ లక్ష్యం

- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి



బలగం టీవి, హైదరాబాద్

దేశ వ్యాప్తంగా వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని మొత్తం 12 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చెప్పారు. ఉపాధి కల్పనకు, ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేందుకు విద్య, వైద్యం, రక్షణ, పరిశోధన వంటి కీలక రంగాల్లో పెట్టుబడులను భారత ప్రభుత్వం పెద్దఎత్తున ఆహ్వానిస్తోందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని ఒక్క ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా ఖాళీగా ఉంచకుండా భర్తీ చేయాలనేదే ప్రధానమంత్రి నరేంద్రమోడీ లక్ష్యమని తెలిపారు. రోజ్ గార్ మేళా ద్వారా ఇప్పటి వరకు 8.50 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని ఆయన వెల్లడించారు.

మంగళవారం బషీర్‌బాగ్‌లోని మిగితా 2వ పేజీలో

## కాంగ్రెస్ మరింత వేధించొచ్చు..

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తమ వైఫల్యాలను, అవినీతిని ఎండగడుతున్నందుకు బీఆర్ఎస్ పార్టీ మీద వాళ్లు అసహనంతో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో 2 రోజులుగా జరుగుతున్న పరిణమాలు కేవలం ఆరంభమేనని.. రాబోయే రోజుల్లో మరిన్ని కష్టాలు ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు కేటీఆర్.

"త్వరలో మనపై కేసులు పెట్టడం, తప్పుడు ప్రచారం చేయడం చూస్తాం. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ పెయిడ్ సోషల్ మీడియా ట్రోల్స్ మనల్ని టార్గెట్ చేస్తాయి. ఏం జరిగినా ఆశ్చర్యపోవద్దు. వాటిని మీ దృష్టి మరల్చనివ్వద్దు." అంటూ ట్విట్టర్ వేదికగా కార్యకర్తలకు కీలక సూచనలు చేశారు కేటీఆర్.

ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో రెండు రోజులు బీఆర్ఎస్ సంబురాలు జరపాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి తిరస్కరించినందుకు గానూ రాష్ట్ర వ్యాప్తంగా సంబురాలు జరపాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల భారం పడకుండా ఆపినందుకు విజయ సూచికగా ఈ సంబురాలు నిర్వహించాలని కోరారు. జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో సంబరాలు చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో సంబరాలు జరపాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను ప్రభుత్వం చేయడంతో, ప్రధాన ప్రతిపక్షంగా వాటిని వ్యతిరేకించాలని పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్‌సీని ఒప్పించగలిగామని కేటీఆర్ అన్నారు.

మొత్తం ఉమ్మడి రాష్ట్ర చరిత్ర నుంచి ఇప్పటి వరకు ప్రధాన ప్రతిపక్షం వాదనలోని సహేతుకతను, న్యాయాన్ని విని చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్‌సీ తిరస్కరించడం ఇదే మొదటి సారి అని కేటీఆర్ అన్నారు.ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను వినిపించిన ఈ సందర్భం చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలపై అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సరైన పద్ధతిలో శాస్త్రీయంగా ఈఆర్‌సీ ముందు ఉంచడంలో విజయం సాధించామన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తనతో పాటు మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు ఈఆర్‌సీని కలిసి విద్యుత్ చార్జీల పెంపును ఆపాలని కోరారని, ఆ తర్వాత జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో మాజీ మంత్రులు ప్రశాంత్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి ప్రజల తరపున వాదనలను గట్టిగా వినిపించారన్నారు. తాను స్వయంగా సిరిసిల్లలో జరిగిన విద్యుత్ చార్జీల పెంపు ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని ప్రజల వాదనను ఈఆర్‌సీకి ఒప్పించడం జరిగిందని కేటీఆర్ గుర్తుచేశారు.

ఈఆర్‌సీ ప్రజల నుంచి వచ్చిన తీవ్రమైన వ్యతిరేకతను, ప్రజాభిప్రాయ సేకరణను, ప్రధాన ప్రతిపక్షంగా తాము వినిపించిన వాదనలను పరిగణనలోకి తీసుకొని ప్రజలపై భారీ విద్యుత్ భారాన్ని మోపకుండా ప్రభుత్వాన్ని నియంత్రించిన తీరు గొప్పదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలపై భారీ విద్యుత్ భారం మోపకుండా ప్రజల పక్షాన నిలిచిన ఈఆర్‌సీకి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి జిల్లా కేంద్రంతో పాటు, నియోజకవర్గ కేంద్రాల్లో విద్యుత్ చార్జీల పెంపును ఆపినందుకు ప్రజల తరపున సంబరాలు చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## పోలీసులకు శుభవార్త

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్‌ల బడ్జెట్ రూ.182. 48 కోట్లను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసింది. పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్‌లకు సంబంధించిన బడ్జెట్‌ను రేవంత్ ప్రభుత్వం భారీ స్థాయిలో విడుదల చేసింది. 182.48 కోట్ల రూపాయల మొత్తాన్ని పోలీస్ సిబ్బందికి మంజూరు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. ఎంతో కాలంగా పోలీస్ సిబ్బంది ఎదురు చూస్తున్న సరెండర్ లీవ్‌లకు సంబంధించిన బడ్జెట్‌ను విడుదల చేయడంపై పోలీస్ అధికారుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మిగిలిన బకాయిలను దశలవారీగా త్వరితగతిన మంజూరు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. మరోవైపు పోలీసు సిబ్బందికి 'సరెండర్' డబ్బులు సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారాలు, సెలవులు, పండగలు, ఇతర ముఖ్యదినా ల్లో సైతం

మిగితా 2వ పేజీలో

## బీఆర్ఎస్ పోరుతోనే తప్పిన కరెంట్ చార్జీల ముప్పు




- ఈఆర్సీ డిస్కంల ప్రతిపాదనలు తిరస్కరించడం అభినందనీయం
- కేసీఆర్ సంస్కరణలతోనే విద్యుత్ వెలుగులు
- ఖజనాను దెబ్బతీసి కాంగ్రెస్సోళ్లు జేబులు నింపుకుంటున్నరు
- ప్రజలను చూసి సీఎం భయపడుతున్నారు
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

'బీఆర్ఎస్ పోరాటంతోనే ప్రజలకు కరెంట్ చార్జీల పెంపు ముప్పు తప్పింది..ఇది ముమ్మాటికీ మా పార్టీ విజయమే' అంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ సర్కారు విద్యుత్ సంస్కరణలు తెచ్చి వెలుగులు నింపితే, కాంగ్రెస్ సర్కారు కోతలతో ప్రజలను ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కొంతకాలంగా ఈఆర్సీ ఎదుట వాదనలు వినిపించి చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై కరెంట్ భారం మోపకుండా కాపాడుకున్నామని చెప్పారు. కేసీఆర్ నేతృత్వంలో కడుపులు కాల్చుకొని పనిచేసి ఏటా 17 నుంచి 18 శాతం ఆదాయం పెంచామన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తొలినాళ్లలో రూ. 60వేల కోట్ల బడ్జెట్‌ను రూ. 2.60లక్షల కోట్లకు చేర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. సర్కారు తెలివితక్కువ నిర్ణయాలతో పోయిన ఆరు నెలల్లో రాష్ట్ర ఆదాయం నాలుగువేల కోట్లు తగ్గిందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఖజానాను దెబ్బతీసి జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. వృద్ధులకు ఇవ్వాల్సిన నాలుగు వేల పింఛన్, మహిళలకు ప్రతినెలా ఇవ్వాల్సిన రూ. 2500, ఆడబిడ్డల పెండ్లిళ్లకు ఇవ్వాల్సిన తుల బంగారం పైసలను కాంగ్రెస్ నాయకులు తమ ఖాతాల్లో వేసుకుంటున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో కడుపుకట్టుకొని పనిచేసి పంటలకు 24 గంటల కరెంట్ ఇస్తే..ఇప్పుడు చీటికి మాటికి కరెంట్ పోయే పరిస్థితి దాపురించింది' అని విమర్శించారు.

**దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇయ్యాలె..**

ప్రభుత్వ తీరుతో వడ్ల కొనుగోళ్లలో కూడా గందరగోళం నెలకొన్నదని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కోతలు మొదలై నెల దాటినా సర్కారు ఇప్పటివరకు మిల్లర్లతో ఒప్పందం చేసుకోలేదని ఆరోపించారు. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్నాలకే వర్తింపజేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఇగ పత్తిరైతులను గాలికొదిలేసిందని విమర్శించారు. దేశంలోనే అత్యంత నాణ్యత కలిగిన తెలంగాణ పత్తికి కేంద్రం మద్దతు ధర ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. గుజరాత్‌లో క్వింటాకు రూ. 8వేలకు పైగా కొంటూ, మన పత్తికి మాత్రం కేవలం రూ. 7521 మద్దతు ధర ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో పంటల కొనుగోళ్ల టైంలో ఆకాశంలో మొగుళ్ల కనబడితే, మా గుండెల్లో రైళ్లు పరిగెత్తే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ఏ ఒక్క మంత్రి కూడా కొనుగోళ్లపై సమీక్ష చేయడంలేదని ఆక్షేపించారు.

**నలుగురు కలిస్తే సర్కారులో వణుకు..**

సీఎం రేవంత్‌రెడ్డి తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పెద్దలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే రక్షణ కల్పించుకోవాల్సిన దారుణ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల ఆర్తనాదాలు ఈ ప్రభుత్వానికి వినపడకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో పండుగలప్పుడు నలుగురు కలిస్తే ఈ ప్రభుత్వం వణికిపోతున్నదన్నారు. అందుకే 144 సెక్షన్ పెట్టి ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. దీపావళి పండుగకు పటాకలు పేలుద్దామని ప్రజలను కుంటే, సర్కారు పెద్దల గుండెళ్లో బాంబులు పేలుతున్నాయని ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లు ప్రజాస్వామ్యం ముసుగులో కాంగ్రెసోళ్లు చెప్పిన నీతులు, ఇప్పుడు చేస్తున్న పనులకు పొంతనలేదన్నారు. ఇన్నాళ్లు మేధావులు, ప్రొఫెసర్లు

మిగితా 2వ పేజీలో

## ఎగవేతల రేవంత్‌రెడ్డి అనే పిలుస్తా



- బతుకమ్మ చీరెలు లేవు.. కేసీఆర్ కిట్లు లేవు..చెరువుల్లో చేప పిల్లలు లేవు..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్

తనపై ఎన్ని కేసులు పెట్టినా.. ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా ముఖ్యమంత్రిని ఎగవేతల రేవంత్‌రెడ్డి అని పిలుస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. వనపర్తిలో నిర్వహించిన రైతాంగ, ప్రజా నిరసన సదస్సులో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన

మిగితా 2వ పేజీలో

## 12 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

భారతీయ విద్యా భవన్‌లో తెలంగాణ తపాలా శాఖ ఆధ్వర్యంలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ మేళాలో భారత ఆహార సంస్థ, సీబీఐటీ, ఆదాయపు పన్ను శాఖ, తపాలా శాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం,జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఎయిమ్స్, రైల్వే తదితర శాఖలలో ఉద్యోగాలకు ఎంపికైన 154 మందికి కేంద్ర మంత్రి నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డిమాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఒక్క రోజే 51 వేల మంది కేంద్ర ఉద్యోగాలు పొందుతున్నారని ప్రకటించారు. వచ్చిన ఉద్యోగం ఏదైనా దృష్టి పెట్టి, ఆత్మవిశ్వాసంతో యువత పని చేయాలని సూచించారు. ప్రపంచాన్ని శాసించే దిశగా ప్రధాని మోడీ అడుగులు వేస్తున్నారని, ప్రపంచం భారత్ వైపు చూస్తోందని, వికసిత భారత్ లక్ష్యంతో దేశం అభివృద్ధి చెందిన దేశంగా చూడాలన్నదే మోడీ లక్ష్యమని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వంద సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి వికసిత్ భారత్- అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. దేశ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకంగా ఉండాలన్నదే మోడీ ప్రధాన ఎజెండా అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఎగవేతల రేవంత్‌రెడ్డి అనే పిలుస్తా

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ పదివేల మంది స్వచ్ఛందంగా తరలిరావడం చూస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద రైతులు ఎంత ఆగ్రహంగా ఉన్నారనే దానికి నిదర్శనమ న్నారు. కొత్త పథకాలు రాలేదని.. పథకాలు బంద్ పెడుతున్నడని విమర్శించారు. బతుకమ్మ చీరెలు లేవు.. కేసీఆర్ కిట్లు లేవు.. చెరువుల్లో చేప పిల్లలు లేవు.. బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంది కనుక ఆ మాత్రం అయినా చేస్తున్నారన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో అనేక హామీలు ఇచ్చారని.. ఒక్కటైనా అమలు అవుతుందా? అని ప్రశ్నిం చారు. అయితే, దేవుడి మీద ఒట్లు అడిగితే తిట్లు అంటూ విమర్శ లు గుప్పించారు. తిట్లతో పాటు కేసులు కూడా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అంటేనే పోరాటాల గడ్డ, చంద్రబాబు, వైఎస్ మీద పోరాటం చేసినోళ్లమని గుర్తు చేశారు.

డిసెంబర్ 9, 2023న రుణమాఫీ చేస్తా అన్నడు చెయ్యలేదని.. పార్లమెంట్ ఎన్నికల్లో పంద్రాగస్టు వరకు చేస్తామని మాట తప్పారన్నారు. ఈయన చెబితే నమ్మరని దేవుళ్ల మీద ఒట్లు వేసిండని.. కురుమూర్తి, జోగులాంబ అమ్మవారు, లక్ష్మీనరసిం హస్వామిపై ఒట్లు వేసి మాట తప్పారని మండిపడ్డారు. రూ.45వేలకోట్లని.. రూ.29వేలకోట్లు అని.. రూ.17వేల కోట్లు చేసినట్లుగా ప్రచారం చేశారన్నారు. సగం మందికి సైతం రుణమాఫీ కాలేదన్నారు. కేసీఆర్ అందరికీ రైతుబంధు ఇస్తే నిబంధనలు పెట్టి రుణమాఫీ ఎగవేశారన్నారు. పాలకుడు దేవుళ్లపై ఒట్లుపెట్టి మాట తప్పితే రాష్ట్రానికి అరిష్టం అవుతుందని తాను దేవుడి దగ్గరకి వెళ్లానన్నారు. ప్రజల్ని కాపాడు.. పాపాత్ముడిని క్షమించమని వేడుకున్నానన్నారు. దానికి కూడా నా మీద కేసులు పెట్టారన్నారు. మోసం చేసినవు నీ పేరు ఏనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డి అన్నానన్నారు. పది నెలలు అయ్యింది మేనిఫెస్టోలో చెప్పినవి అమలు చేయలేదు అంటే బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టారన్నారు. బిడ్డా రేవంత్ రెడ్డి నువ్వు నా మీద ఎన్ని కేసులు పెట్టినా.. నీ హామీలు అమలు చేసేదాకా నిన్ను ఎనుముల రేవంత్ రెడ్డి కాదు, ఎగవేతల రేవంత్ రెడ్డి అని పిలుస్తానని స్పష్టం చేశారు. బేగంబజార్ కాదు ఏ బజార్‌లో కేసులు పెట్టుకుంటవో పెట్టుకోమంటూ మండిపడ్డారు. మూసీ పేరిట రూ.1.50లక్షలకోట్లు అంటున్నాడని.. కానీ, రైతులకు రైతుబంధు ఇచ్చేది లేదు.. రైతుబంధు ఇవ్వాలంటే ఊకుందామా.. ఊరికిద్దామా? అన్నారు. రైతుబంధు, రుణమాఫీ, బీమా పేరిట రూ.1.50లక్షల కోట్లు కేసీఆర్ రైతులకు ఇచ్చిండు కానీ రేవంత్ రెడ్డి రుణమాఫీ అని చెప్పి పచ్చి మోసం చేసిండు. అన్ని పంటలకు బోనస్ అని చెప్పి, సన్నాలకు అని మాట తప్పాడు డెడ్‌లైన్, పేపర్ హెడ్‌లైన్ మారినయన్నారు. రుణమాఫీ ఒక లైన్‌లోకి రాలేదన్నారు.

గతంలో వనపర్తిని వలసల వనపర్తి అనేవారని.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక బుద్దారం బ్రాంచ్ కెనాల్, ఘనపురం తవ్వించామన్నారు. కేసీఆర్‌తో వలసల వనపర్తిని వరికోతల వనపర్తి అయ్యిందన్నారు. ఇంజినీరింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజ్ తెచ్చారన్నారు. వనపర్తిని సరస్వతి నిలయం చేసింది నిరంజన్ రెడ్డేనన్నారు. పది నెలల కాలంలో వనపర్తిలో పైసా పని అయ్యిందా? అన్ని వర్గాలను రోడ్ల మీదకు తెచ్చాడన్నారు. జీవో29 తెచ్చి ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు రాకుండా చేస్తున్నడు అన్యాయం అంటే పిల్లల ఈపులు పగల కొడుతున్నడు. ప్రజా పాలన అన్నాడన్నారు. అర్ధరాత్రి విద్యార్థులను గొడ్డును కొట్టినట్లు కొట్టిస్తున్నారన్నారు. పోలిసొల్లను నమ్మడం లేదన్నారు. స్పెషల్ పోలీసులను తొలగించి ఆత్మవిశ్వాసం మీద దెబ్బ కొట్టారన్నారు. ముఖ్యమంత్రిగా సమస్యలు పరిష్కరించడంలో ఫెయిల్ అయ్యారని.. పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇవ్వడం లేదన్నారు. రైతులు ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నారు. అన్ని వర్గాలు ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. కరెంట్ బిల్లులు పెంచవద్దని కొట్లడితే పెంచలేదన్నారు. బీఆర్ఎస్ పోరాటం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ మెడలు వంచి రైతుబంధు ఇప్పిస్తానన్నారు. మహిళలకి 2500 మహాలక్ష్మి, ఆటో డ్రైవర్లకు, వ్యవసాయ కూలీలకు చెప్పినట్లు హామీలు ఇవ్వాలన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. తెలంగాణ భవన్‌లో లీగల్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. 480 మందికి స్తే తెచ్చామన్నారు. ఇల్లు కులగొట్టకుండా.. తాము అండగా ఉంటామన్నారు. అతి చేస్తున్న పోలీసుల పేర్లు డెయిరీలో రాస్తున్నామన్నారు.

## పోలీసులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు విధులు నిర్వహించాల్సి ఉంటుంది.దానికోసం వారికి సరెండర్ (ప్రభుత్వ ఉద్యోగుల్లో కొన్ని విభాగాలకు వర్తిస్తుంది) పద్ధతి ద్వారా సెలవులు లేదా డబ్బులు ఇస్తుంటారు. అంటే ప్రతి ఏడాది రెండు సరెండర్‌లు ఉంటాయి. ఒక్కో సరెండర్ ద్వారా 15 రోజుల జీతం అద నంగా ఇస్తుంటారు. వీటిని జనవరి %-% జూలై నెలల్లో అందజేస్తారు. దానికి తోడు వారికి ప్రతి ఏడాది జమయ్యే 30 ఈఎల్స్ (ఎర్న్‌డ్ లీవ్స్)లో 15 రోజులకు ఎన్‌క్యాష్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అంటే నవంబర్‌లో 15 రోజుల సెలవులకు సంబంధించి ఎన్‌క్యాష్ చేసుకుంటే వారికి ఆ డబ్బు కూడా ఇస్తారు. అయితే గతేడాది జూలై, నవంబర్, ఈ ఏడాది జనవరికి సంబంధించిన డబ్బులు చాలా మంది పోలీసు సిబ్బందికి అంద లేదు. పోలీస్ ఉద్యోగం అంటే కత్తిమీద సాములాంటిది. ఎప్పుడు ఏ ఉపద్రవం వస్తుందోనని నిత్యం అలర్ట్‌గా ఉండాలి. ఇతర ఉద్యోగుల మాదిరిగా వీరికి పండగలు, ఆదివారం సెలవులు ఉండవు. నెలలో 30 రోజులూ డ్యూటీలో ఉండాల్సిందే.

అందుకే వీరికి ప్రభుత్వం ప్రోత్సాహకంగా సరెం డర్ లీవ్స్ పేరుతో ప్రోత్సాహకం అందిస్తోంది. ఉద్యోగుల సీనియారిటీని బట్టి బేసిక్‌పై సరెండర్స్ ఇస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సరెండర్స్ పెండింగ్‌లో పెట్టింది. పోలీస్ ఉద్యోగులు వాటికోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ మైనా వీటిని మంజూరు చేస్తుందన్న ఆశతో పోలీసులు ఎదురుచేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో దాదాపు 3,000 మంది పోలీసులు ఉన్నారు. వీరికి బేసిక్ ప్రకారం మూడు సరెండర్స్ పెండింగ్‌లో ఉండగా, జనవరితో నాలుగో సరెండర్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి తోడు ఆరు నెలలుగా టిఎ, నాలుగేళ్లుగా డిఎలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ఒక్కో ఉద్యోగికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రావాల్సి ఉంది. కాగా, సరెండర్స్ క్రమం తప్పకుండా చెల్లిస్తే పిల్లల చదువులు, వైద్య ఖర్చు లకు ఉపయోగపడతాయని చాలామంది పోలీసులు భావిస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న బకాయిలు వస్తే తమ అవసరాలకు వాడుకుంటా మని బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలందరి చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. అవి వస్తే ఆస్పత్రిలో వైద్యం చేయి ంచుకోవడానికో, పిల్లలకు ఉన్నత చదు వులకో, వాహన కొనుగోళ్లకో ఉపయోగపడతాయని చాలామంది ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సరెండర్స్‌పై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే ఈ ప్రక్రియను ప్రారంభించిందని, త్వాం దరలోనే వచ్చే అవకాశం ఉందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులుగా ఎంపికై ట్రాన్స్‌కో, టెలికాం, ఆర్టీసీ, రవాణా శాఖల్లో పనిచేస్తున్న వారికి సరెండర్స్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. తమకూ వస్తాయని పోలీసులు ఆశిస్తున్నారు. ఇప్పుడు సరెండర్ లీవ్‌ల బడ్జెట్ రూ.182.48 కోట్లను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేయడంతో పోలీసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బీఆర్ఎస్ పోరుతోనే తప్పిన కరెంట్ చార్జీల ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

అని చెప్పుకున్న కొందరూ రేవంత్‌రెడ్డి అప్రజాస్వామిక విధానాలను సమర్థిస్తూ తమస్థాయిని తగ్గించుకుంటు న్నారన్నారు. నిజంగా వారికి చిత్తశుద్ధి ఉంటే దామగుండం, మూసీ ప్రాజెక్టు, అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ మీద మాట్లాడాలని హితవు పలికారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తగిన సమయంలో కర్రుకాల్చి వాతపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఇప్పటికైనా వడ్లతో పాటు పత్తికి కూడా మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**దావత్‌లు చేసుకుంటే దాడులు చేస్తారా?**

పండుగల వేళ ప్రజలు ఇండ్లల్లో దావత్‌లు చేసుకోవద్దా? అంటే విందులకు కూడా పర్మిషన్లు తీసుకోవాలా? అంటూ జగదీశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేటీఆర్ బంధువుల ఇంటిపై దాడులు చేయించిన రేవంత్‌రెడ్డి సాధించేంటని నిలదీశారు. కనీసం కొండను తవ్వి ఎలుకనూ కూడా పట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. న్యాయం చేయాలని ఆందోళనకు దిగిన స్పెషల్ పార్టీ పోలీసులను తీసేసిన ఆయన, రేపు సాయుధ పోలీసులు తిరబడితే ఏంచేస్తారు? చంద్రబాబుతో మాట్లాడి ఆంధ్రా పోలీసులను తెచ్చుకుం టారా? అని సూటిగా ప్రశ్నించారు.

## టీడీపీలో చేరిన నటుడు బాబు మోహన్

బలగం టీవీ, హైదరాబాద్

మాజీ మంత్రి, నటుడు బాబు మోహన్ టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఆందోల్ నియోజకవర్గంలో సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఓ ఫోట్‌ను షేర్ చేసుకున్నారు. కాగా, బాబు మోహన్ తొలిసారిగా 1998 ఉపఎన్నికలో ఆందోల్ టీడీపీ అభ్యర్థిగా గెలిచారు. అనంతరం 1999లోనూ విజయం సాధించి మంత్రి అయ్యారు. అనంతరం టీఆర్ఎస్‌లో చేరి 2004, 2014 లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజ నర్సింహ చేతిలో టీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం పొందారు.2018లో బీఆర్ఎస్ నుంచి టికెట్ రాకపోవడంతో బీజేపీలో చేరారు. బీజేపీ నుంచి పోటీ చేసి బీఆర్?ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ చేతిలో, 2023లో బీజేపీ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహా చేతిలో ఓడిపోయాడు. గత ఏడాది బిజెపి కి కూడా రాజీనామా చేశారు.. ఆ ఎన్నికలలో ప్రజాశాంతి పార్టీ తరుపున పోటీ చేయాలని భావించి ఆ పార్టీలో చేరారు.. అయితే ఒక్క రోజులోనే ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇప్పుడు మళ్లీ స్వంత గూడు టిడిపిలోకి చేరారు



## కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి : బండి సంజయ్

బలగం టీవీ, హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తనకు ఇచ్చిన లీగల్ నోటీసులో నిరాధారమైన ఆరోపణలు చేశారని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్, మాదక ద్రవ్యాల అంశంలో తనపై నిరాధారమైన ఆరోపణలు చేశారని కెటిఆర్ ఇటీవల బండి సంజయ్‌కు లీగల్ నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. వారం రోజుల్లోగా తనకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో న్యాయమైరమైన చర్యలు తీసుకుంటానని ఆ నోటీసులో పేర్కొన్నారు. అయితే ఇందుకు బండి సంజయ్ జవాబిస్తూ తనపై నిరాధారమైన ఆరోపణలు చేశారని తెలిపారు. దురుద్దేశ్యపూర్వకంగానే తనకు లీగల్ నోటీసులు ఇచ్చారని అన్నారు. తనకు వారం రోజుల్లోగా కెటిఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదంటే తాను కోర్టుద్వారానే తేల్చుకుంటానని తెలిపారు.

## మహారాష్ట్రలో ముగిసిన నామినేషన్లు

బలగం టీవీ, ముంబై

: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం మంగళవారంతో ముగిసింది. అయితే 15 సీట్లలో పోటీ చేసే అభ్యర్థులపై పార్టీల్లో ఇంకా స్పష్టత కొరవడింది. అధికార బీజేపీ, శివసేన, ఎన్సీపీ (అజిత్ పవార్) వర్గంలో నాలుగు సీట్లకు ఇంకా అభ్యర్థులను ప్రకటించ లేదు. ఇక విపక్ష మహా వికాస్ అఘాడీలోని శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీలు 11 స్థానాల్లో అభ్యర్థుల ప్రకటనపై మల్లగుల్లాలు పడుతున్నాయి.ఇప్పటివరకు బీజేపీ 152, అజిత్ పవార్ ఎన్సీపీ 52, ఏక్ నాథ్ షిండే శివసేన 80 సీట్లలో అభ్యర్థులను రంగంలోకి దించింది. ఇందులో చిన్న పార్టీలకు చెందిన వారు కూడా ఉన్నారు. అలాగే ఎంవీఏలో కాంగ్రెస్ 103, ఉద్ధవ్ ఠాక్రే శివసేన 87, శరద్ పవార్ ఎన్సీపీ 87 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇంకా 11 సీట్లకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అయితే వాటిలో కొన్ని సమాజ్ వాది పార్టీ లాంటి మిత్రపక్షాలకు కేటాయించవచ్చని ప్రచారం జరుగుతున్నది.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి..



- డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4 లక్షల 75 వేల 64 మంది ఓటర్ల వివరాలతో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల చేయడం జరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో గల సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జనవరి 1,2025 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రజల వివరాలతో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల చేశామని, వేములవాడ నియోజకవర్గం లో మొత్తం 2,27,575 మంది ఓటర్లు, సిరిసిల్ల నియోజకవర్గం లో 2, 47,489 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

మన జిల్లాలో మొత్తం 2,28,745 మంది పురుషులు, 2,46,114 మంది స్త్రీలు, 37 మంది ఇతరులు ఓటర్లుగా ఉన్నారని, మరో 161 పురుషులు, 7 మహిళలు సర్వీస్ ఓటర్లుగా ఉన్నారని తెలిపారు.

18 సంవత్సరాలు నిండిన ప్రజలు తమ పేర్లను డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో చెక్ చేసుకోవాలని, లేని పక్షంలో నవంబర్ 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 9,10 తేదీలలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక క్యాంపులను సైతం ఏర్పాటు చేస్తామని, వీటిని వినియోగించుకుని అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించాలి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)పై జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వచ్చే నెల నవంబర్ ఒకటో తేదీ నుంచి హౌస్ లిస్టింగ్ సర్వే మొదలు కానుందని, మాస్టర్ ట్రెయినర్లు తమ పరిధిలోని ఎన్యుమరేటర్లకు సర్వే సందర్భంగా తీసుకోవాల్సిన వివరాలు, వాటిని నిర్ణిత ఫారాల్లో నింపాలని అన్నారు . ప్రతి అంశానికి సంబంధించిన అన్ని బుక్ లెట్లో ఉన్నాయని, వాటికి అనుగుణంగా నిర్ణిత ఫారాల్లో కోడ్స్ వేయాలని తెలిపారు. సర్వేతో జిల్లాలోని అన్ని కుటుంబాల వివరాలు తెలుస్తాయని, ప్రభుత్వం భవిష్యత్తులో చేపట్టనున్న పథకాలు, అభివృద్ధి ఫలాలు అందే అవకాశం ఉందని అన్నారు.సర్వే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి వివరించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య ఎస్ డి సి రాధాభాయ్ ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# నవంబర్ 1న కరీంనగర్‌కు బీసీ కమిషన్ బృందం రాక..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 1న కరీంనగర్ కు విచ్చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్ 1న కరీంనగర్ కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీ.సీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని అన్నారు. అభిప్రాయాలు , సలహాలు, సూచనలు, తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా ఎవరైనను సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్ కు నివేదించవచ్చనితెలిపారు .



# తవ్వకాలలో బయటపడిన పెద్దమ్మ తల్లి విగ్రహం

**బలగం టీవీ , వరంగల్**

వరంగల్ జిల్లా ములుగు రోడ్డు ఇండస్ట్రియల్ ఏరియాలో జరుగుతున్న తవ్వకాల్లో పెద్దమ్మ తల్లి విగ్రహం బయటపడింది. మంగళవారం భక్తులు దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ పురాతన విగ్రహాల వద్ద నాగసర్పాలు ఉన్నాయంటే సుమారు 1000 సంవత్సరాల పురాతనమైనవిగా చరిత్ర చెబుతుందన్నారు. కాకతీయులు ఓరుగల్లును పరిపాలించే సమయంలో మొదటి నుండి చిట్టచివరి గణపతి దేవుడు వారు శైవమతాన్ని, శివుడిని, అమ్మవారిని పూజించిన చరిత్ర మనకు ఉంది. ఓరుగల్లులో భద్రకాళి అమ్మవారు, హన్మకొండలో హనుమద్గిరి పద్మాక్షి అమ్మవార్లు ఉన్నారన్నారు. గతంలో పెద్దమ్మ గడ్డ పేరు వచ్చిందంటే పెద్దమ్మ తల్లి దేవాలయం ఉండేదని చరిత్ర చెప్తుందన్నారు. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ఒక చోటపెట్టి గుడిని ప్రతిష్ఠిచాలన్నారు. .

# సికింద్రాబాద్ సబ్ రిజిస్ట్రార్ అరెస్ట్

**బలగం టీవీ , మేడ్చల్**

సికింద్రాబాద సబ్ రిజిస్ట్రార్ జ్యోతిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ పత్రాలతో ల్యాండ్ రిజిస్ట్రేషన్ కోసం సహకరించారన్న ఆరోపణలతో ఆమెను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. మేడ్చల్ కోర్టు సబ్ రిజిస్ట్రార్ జ్యోతికి 14 రోజులు పాటు రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళ్తే.. ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌కు చెందిన లెండ్యాల సురేష్‌కు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లోని సుభాష్‌నగర్ ప్రాంతంలో 200 గజాల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంపై సుభాష్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ మహిళా నేత పద్మజారెడ్డి కన్నుపడింది. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు హయత్‌నగర్‌కు చెందిన కరుణాకర్‌ను సంప్రదించి, అతడికి రూ.3.50 లక్షలు చెల్లించి ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించారు. ఈ స్థలం యజమాని 1992లోనే మతి చెందినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. అలాగే రవిశంకర్ అనే వ్యక్తిని లెండ్యాల సురేష్‌కు కుమారుడిగా సృష్టించారు. ఆధార్ కేంద్రం ఆపరేటర్‌గా నరేంద్ర సాయంతో హరీశ్ అనే వ్యక్తిని రవిశంకర్‌గా చూపించి ఫేక్ పాన్‌కార్డు తయారు చేశారు. ఈ పాన్ కార్డు సాయంతో ఆధార్‌లో మార్పులు చేశారు. 2023 ఫిబ్రవరిలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన జ్యోతి సాయంతో బీఆర్ఎస్ నేత పద్మజారెడ్డి సోదరికి ఈ స్థలాన్ని రవిశంకర్ అమ్మినట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే తన స్థలం కబ్జా చేశారని యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తులో అసలు విషయం వెలుగుచూసింది. పద్మజా రెడ్డితో పాటు సబ్ రిజిస్ట్రార్ జ్యోతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇటీవల పద్మజారెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు తాజాగా ప్రస్తుతం సికింద్రాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న జ్యోతిని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నకిలీపత్రాలు, ల్యాప్‌టాప్‌లు, స్కానర్ ఇతర పరికరాలను పోలీసులు సీజ్ చేశారు.



# నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ , హైదరాబాద్**

విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకు రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రజలపై రూ.18500 కోట్ల భారం పడకుండా ఆపినందుకు విజయ సూచికగా ఈ సంబురాలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో సంబరాలు జరపాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.పది నెలల కాలంలోనే 18500 కోట్ల విద్యుత్ ఛార్జీల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేసిందని కేటీఆర్ అన్నారు. ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని ప్రధాన ప్రతిపక్షంగా వ్యతిరేకించామని తెలిపారు. పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని దీనిపై ఈఆర్సీపి ఒప్పించలిగామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షంగా తమ వాదనలోని సహేతుకత, న్యాయాన్నిను ఈఆర్సీ గుర్తించి విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను తిరస్కరించిందని అన్నారు.

విద్యుత్ పెంపు ప్రతిపాదనలను తిరస్కరించినందుకు ఈఆర్సీ చైర్మన్ శ్రీ రంగారావు, సభ్యులు మనోహర్ రాజు, కృష్ణయ్యకు తెలంగాణ ప్రజల తరపున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. విద్యుత్ చార్జీల పేరిట రూ. 18,500 కోట్ల అదనపు భారం ప్రజలపై మోపడాన్ని హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్లలో నిర్వహించిన మూడు బహిరంగ విచారణలలో తాము తీవ్రంగా వ్యతిరేకించామని కేటీఆర్ తెలిపారు. ఇది తెలంగాణ ప్రజల విజయం అని కేటీఆర్ పేర్కొన్నారు.

# బాలికపై సామూహిక లైంగికదాడి

**బలగం టీవీ , సిద్దిపేట**

బాలికపై ముగ్గురు సహచర విద్యార్థులు సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా, హుస్నాబాద్‌లో చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం ఈ ఘటన జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థినిపై ఆమెతోపాటు చదువుతున్న ముగ్గురు విద్యార్థులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. తనపై జరిగిన అఘాయిత్యం గు రించి బాలిక సోమవారం రాత్రి తన తల్లికి చెప్ప గా ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితులపై పోక్సో కేసు నమోదు చేశామని ఏసీపీ వాసాల సతీష్ తెలిపారు. లైంగికదాడికి పాల్పడిన విద్యార్థులు బాధిత బాలిక నివసిస్తున్న కాలనీకి చెందిన వారిగా గుర్తించామని అన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. బాలికను వైద్య పరీక్షలకు పంపినట్లు తెలిపారు.

# ఏసీబీకి చిక్కిన ఏఈఈ

**బలగం టీవీ , హైదరాబాద్**

రాజేంద్రనగర్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకోబ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) పోలీసులకు పట్టుబడ్డారు. వెంకోబ నెల క్రితమే రాజేంద్రనగర్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయం నుంచి సర్కిల్ 14కు బదిలీ అయ్యారు. రాజేంద్రనగర్‌లో పరిధిలో ఎంబీల్ రాసేందుకు ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలు డిమాండ్ చేశారు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించారు. వారి సూచనల మేరకు వెంకోబకు కాంట్రాక్టర్ డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# వన్డే సిరీస్ కైవసం




**బలగం టీవీ, హైదరాబాద్**

యూఏఈ వేదికగా ఇటీవల జరిగిన మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో నిరాశపరిచిన భారత్ మహిళల క్రికెట్ జట్టు.. రెండు వారాల వ్యవధిలోనే తిరిగి ఫామ్‌లోకి వచ్చింది. టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ జట్టు కనీసం సెమీస్ కూడా చేరకుండానే నిష్క్రమించడానికి కారణం న్యూజిలాండ్ చేతిలో ఓటమి. దాంతో ఆ జట్టుపై భారత్ ప్రతీకారం తీర్చుకుంది.

మంగళవారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన మూడో వన్డేలో టీమిండియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించి 2-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

కివీస్ నిర్దేశించిన 233 పరుగుల ఛేదనలో భారత జట్టు దుమ్మురేపింది. ఓపెనర్ స్మృతి మంధాన (100) శతకంతో విజృంబించగా.. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (59 నాటౌట్) హాఫ్ సెంచరీతో చెలరేగింది. యాస్తికా భాటియా (35), జెమిమా రోడ్రిగ్స్ (22) రాణించారు. దీంతో భారత జట్టు 44.2 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 236 పరుగులు సాధించి కివీస్‌ను చిత్తుగా ఓడించింది.

కాగా, ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్.. 49.5 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్రూక్ హాలిడే (86) అర్ధశతకంతో ఆకట్టుకుంది. జార్జియా ప్లిమ్మర్ (39), ఇసాబెల్లా గాజ్ (25), లీ తహుహు (24నాటౌట్) పరువాలేదనిపించారు. మిగిలిన వారు స్వల్ప పరుగులకే పెవిలియన్ కు క్యూ కట్టారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ మూడు, ప్రియా మిశ్రా రెండు వికెట్లు తీయగా రేణుకా సింగ్, సైమా ఠాకూర్ తలో వికెట్ దక్కించుకున్నారు.






# దక్షిణాఫ్రికా సూపర్ బ్యాటింగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

దక్షిణాఫ్రికా రెండో టెస్టులో అదరగొడు తోంది. తొలి రోజు ఓపెనర్ టోనీ డీ జోర్జి(141 నాటౌట్), యువకెరటం ట్రిస్టన్ స్టబ్స్(106)లు శతకాలతో చెలరేగారు. దాంతో, తొలిరోజు ఆట ముగిసే సరికి మర్క్‌రమ్ సేన 2 వికెట్ల నష్టానికి 307 పరుగులు చేసింది.

ఛత్తోగ్రామ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా కుర్రాళ్లు టోనీ డి జోర్జి(141 నాటౌట్ : 198 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు), ట్రిస్టన్ స్టబ్స్(106 : 211 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లు)లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. బంగ్లాదేశ్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ఇద్దరూ సెంచరీలతో గర్జించారు. టాస్ గెలిచన దక్షిణాఫ్రికా కెప్టెన్ ఎడెన్ మర్క్‌రమ్ బ్యాటింగ్ తీసుకోగా.. సఫారీ జట్టు తమ ఇన్నింగ్స్‌ను ధాటిగా మొదలెట్టింది. తొలి వికెట్‌కు ఓపెనర్ టోనీ డీ జోర్జితో కలిసి 69 పరుగులు జోడించిన మర్క్‌రమ్(33)ను తైజుల్ ఇస్లాం బోల్తా కొట్టించాడు.ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్టబ్స్ తన మార్క్ ఆటతో బంగ్లా బౌలర్లకు దడ పుట్టించాడు.మొదట జోర్జి శతకం సాధించగా.. స్టబ్స్ కూడా వందతో జట్టు స్కోర్ 250 దాటించాడు. సెంచరీ తర్వాత స్టబ్స్‌ను తైజుల్ బౌల్డ్ చేయడంతో బంగ్లా ఆటగాళ్లు ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. జోర్జీ మాత్రం జోరు తగ్గించకలేదు. డేవిండ్ బడింగ్‌హమ్(18) నిదానంగా ఆడడంతో దక్షిణాఫ్రికా ఆట ముగిసే సరికి 2 వికెట్లు కోల్పోయి 307 రన్స్ కొట్టింది.

# దీపావళి కానుకగా ‘జై హనుమాన్’ ఫస్ట్ లుక్




**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన హనుమాన్ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టించింది. అయితే ఈ సినిమాకు సీక్వెల్ వస్తున్న విషయం తెలిసిందే. ‘జై హనుమాన్’ అంటూ ఈ సినిమా రానుండగా.. ఇప్పటికే ప్రీ ప్రోడక్షన్ పనులు జరుపుకుంటుంది ఈ చిత్రం. అయితే ఈ మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నాడు దర్శకుడు ప్రశాంత్ వర్మ. దీపావళి కానుకగా ‘జై హనుమాన్’ ఫస్ట్ లుక్ విడుదల చేయనున్నట్లు ప్రకటించాడు. అయితే ఈ సినిమాలో హనుమంతుడిగా ఎవరు నటించబోతున్నారు అనేది ప్రస్తుతం సస్పెన్స్‌గా మారింది. మరోవైపు ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. హనుమాన్ సినిమా క్లైమాక్స్‌లో చివరి ఐదు నిమిషాలలో వచ్చే హై ఏదైతే ఉందో అదే ఊపు జై హనుమాన్ సినిమాలో రెండు గంటలు ఉంటుందని వెల్లడించాడు. ఇక ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్, రవిశంకర్ నిర్మిస్తున్నారు.

# ‘కనుగొనడం కోసం తిరుగుతున్నా’




**• ఇన్‌స్టాలో పోస్ట్ షేర్ చేసిన రాజమౌళి**

**బలగం టీవీ, హైదరాబాద్**

మహేశ్‌బాబు హీరోగా ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ సినిమా పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. అయితే ర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం ఆఫ్రికాలో ఉన్నాడు. మహేష్ బాబు మూవీ కోసం లొకేషన్లు వెతుకుతున్నట్టు తెలుస్తోంది. తాజాగా కెన్యాలోని నేషనల్ పార్కులో రాజమౌళి, కార్తికేయలు చక్కర్లు కొడుతున్నారు. అక్కడి అటవీ ప్రాంతాన్ని, జంతువులు ఎక్కువగా ఉండే ప్రదేశాలను సర్చ్ చేస్తున్నారు.

తాజాగా దర్శకుడు రాజమౌళి ఓ అప్‌డేట్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా ఎడారి ప్రాంతంలో తిరుగుతున్న ఫొటో షేర్ చేసి ‘కనుగొనడం కోసం తిరుగుతున్నా’ అని క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆయన మహేశ్ సినిమా కోసం లొకేషన్స్ సెర్చ్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. త్వరలోనే అప్‌డేట్ షేర్ చేయాలని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. అయితే ఈ చిత్రంలో జంతువులు ఎక్కువగా కనిపిస్తాయి అని ఇటీవల జక్కన్న హింట్ ఇచ్చారు. తాజాగా ఆయన పోస్ట్ చేసిన ఫొటోలో జంతువుల గుంపు కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. కనీసం ఇలాగైనా అప్‌డేట్ ఇచ్చారంటూ అభిమానులు ఆనందిస్తున్నారు.




# జాతర ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

ఫస్ట్ లుక్‌తోనే సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది జాతర సినిమా. దేవుడు ఆడే జగన్నాటకం.. ఆ దేవునితో మనిషి ఆడించే పితలాటకం అంటూ సతీశ్ బాబు రాటకొండ స్వీయ దర్శకత్వంలో నటిస్తోన్న జాతర ట్రైలర్‌ను ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. చిత్తూరు బ్యాక్ డ్రాప్‌లో సాగే జాతర నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నవంబర్ 8న ప్రేక్షకుల ముందు రానుంది. గల్లా మంజునాథ్ సమర్పిస్తున్న ఈ మూవీని రాధాకృష్ణ ప్రొడక్షన్ కంపెనీ బ్యానర్‌పై ఎల్ఎల్‌సీతో కలిసి రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీలో దియారాజ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. గోపాల్ రెడ్డి, మహబూబ్ బాషా, సాయి విక్రాంత్, ఆర్‌కే పిన్నపాల ఇతర పాత్రల్లో నటిస్తుండగా.. శ్రీజిత్ ఎడవణ సంగీతం అందిస్తున్నారు.